# మంచి పని

ఆవేళ ప్రిన్సిపాల్ రామనాథంగారు కాలేజీకి పెందరాళే వచ్చేశారు. ఇంకా తొమ్మిది కాలేదు. అది ఆయనకు అలవాటు. ఎప్పుడైనా మనసు బాగుండకపోతే అలా పెందరాళే కాలేజికి వచ్చేసి, ఏకాంతంగా తన గదిలో కాస్సేపు ఆలోచించుకుంటూ కూర్చుంటారు.

ఇంట్లో పెద్ద సందడిగా ఉంటుందని కాదు. ఇల్లు కాస్త పెద్దదే! భార్య మహాలక్ష్మి, తనూ తప్ప ఇంకఎవరూ లేరు. ఒకళ్ళిద్దరు పనివాళ్ళున్నారు. ఏదో పనిచూసుకుంటూ ఉంటారు. మహాలక్ష్మి ఎప్పుడూ ఏవో పూజలూ, జపాలూ చేసుకుంటూ ఉంటుంది. ఏభై ఏళ్ల దగ్గరికి వస్తున్నా తనకింకా సంతానం కలుగుతుందేమోనన్న ఆశ ఆమెకుచావలేదు. సంతానం కావాలన్న కోరిక పోలేదు. జీవితానికి అదేదో పెద్ద లోపంలా, మనిషికి అది ఒక్కటే శాపంలా ఏమిటో పరితపించిపోతుంది. ఇంటికి ఎవరు వచ్చినా దాన్ని గురించే మాట్లాడుతూ ఉంటుంది. అంచేత రామనాథంగారు ఇంట్లో తనగదిలో ఉన్నా ఏకాంతానికేమీ ఇబ్బంది లేదు. అయినా ఆయన కక్కడ తోచదు. కాలేజిలో తనగదిలో కాస్సేపు విశ్రాంతిగా కూర్చున్నప్పుడే తను మనిషిగా బ్రతుకుతున్నట్లనిపిస్తుంది.

ఆవేళ ఆయన మనస్సు ఏమీ బాగాలేదు. ఒక్క విషయం తనకిష్టం లేకపోయినా తప్పనిసరిగా చేయవలసి ఉంది. ఆయన దాన్ని గురించే ఆలోచిస్తున్నాడు. లెక్కల లెక్చరర్ శివరావు ప్రవర్తన ఏమీబాగాలేదు. అతన్ని గురించి చాలా రోజులుగా ఊరూ పేరూలేని ఉత్తరాలు వస్తున్నాయి. అందరూ అతన్ని గురించి ఏవేవో చెబుతూనేఉన్నారు. ఇది గొడవగా ఉంది. తను ఎంత నిర్లిప్తంగా ఉన్నా కుదరటంలేదు.

అసలు విషయం ఇదీ: శివరావుకు నందన అనే విద్యార్థినితో స్నేహం ఏర్పడింది. అమధ్య కొన్నాళ్ళు సెలవుపెట్టి ఊరికి వెళ్ళాడు. అప్పుడు ఆ అమ్మాయి కూడా కాలేజికి రాలేదు. ఏదో సాకుతో హాస్టల్లోంచి వెళ్ళిపోయింది. శివరావు ఆ అమ్మాయి కలిసి ఎక్కడికో వెళ్ళారని అంతా గోలపెట్టారు. నందన తండ్రి ఊరినించి వచ్చి పిల్లను చదువు మాన్పించి తీసుకువెళ్ళాడు. కాని నందన వెళ్ళినట్లే వెళ్ళి మర్నాడు తిరిగివచ్చింది. ఇప్పుడు బాహాటంగానే శివరావుతో కలిసి ఉంటోంది. భార్యా ముగ్గురు పిల్లలు ఉన్నా, శివరావు ఇప్పుడు నందనను కూడా పెళ్ళి చేసుకుంటా నంటున్నాడు నందన తండ్రి శివరావు మీద ఒక ఫిర్యాదు రాసి పంపాడు. ఇంక ఇప్పుడు దాన్ని గురించి విచారించక తప్పదు. కాలేజి కమిటీకి ఒక రిపోర్టు రాసి పంపాలి. ఇంతవరకు అంతా తెలిసి, ఏమి తెలియనట్లు తను నిర్లిప్తంగా ఉన్నాడు. ఇప్పుడింక లాభంలేదు. శివరావుతో మాట్లాడాలి. అతను ఈ గొడవలోంచి ఏవిధంగానైనా మర్యాదగా బయటపడతాడేమో చూడాలి. తక్కిన స్టాఫ్ అంతా ఏమంటారో కనుక్కోవాలి. తరువాత రిపోర్టురాసి పంపాలి. తను శివరావు గురించి ఏ మాత్రం చెడ్డగా రాసినా అతని ఉద్యోగం పోతుంది. అతను ఇంకా పర్మనెంటు కాలేదు. అందుకే ఆందోళనగా ఉంది. శివరావుకు వేరే ఆధారం ఏమీలేదు. మళ్ళా ఎక్కడైనా ఉద్యోగం దొరికేవరకూ చాలా బాధపడతాడు. ఆ జాలి పీడిస్తోంది. శివరావు ఇప్పుడైనా జాగ్రత్తగా ఉంటానని మాట ఇస్తే చాలు. అలాకాక పోతే ఏంచెయ్యాలో మరి !

పదిగంటలు కావస్తోంది. కాలేజి సందడిగా ఉంది. కాస్సేపటికి శివరావును పిలిచాడు. నందన తండ్రి, ఇంకా ఇతరులు రాసిన ఉత్తరాలు చూపించాడు. "ఇప్పటికైనా ఇంకమీదట జాగ్రత్తగా ఉంటాననిరాసియ్యి." అని ఎంతో నెమ్మదిగా చెప్పాడు. శివరావు ఏమీ చలించలేదు. నిర్లక్ష్యంగా అన్నాడు.

"నందనను నేను తప్పకుండా పెళ్ళిచేసుకుంటాను. ఆమె గర్భవతి. నా ఉద్యోగం పోయినా ఫరవాలేదు" అంటూ వెళ్ళిపోయాడు. ఆ ధోరణి తనకు చాల వింతగా తోచింది. ఏమీ పాలుపోక కూర్చున్నాడు ఎంతో సేపు!

మూడు గంటలకు తక్కిన స్టాఫ్‌నందరినీ పిలిచాడు. ఏం చెయ్యమంటారని సలహా అడిగాడు. అందరూ శివరావును అసహ్యించుకుంటూనే మాట్లాడారు. అందరికన్నా కామర్స్ లెక్చరరు లక్ష్మయ్య మరీ ఆవేశ పడ్డాడు. లక్ష్మయ్యకు ఏవేవో ఎవరెవరితోనో సంబంధాలున్నాయని ఊరంతా తెలుసు. అయితే అవన్నీ చాటుగా ఉన్నాయి. అందరూ వాటిని గురించి చాటుగా మాత్రమే చెప్పుకుంటున్నారు. అయినా అతను అంతగా ఆవేశ పడడం తనకేదో ముల్లుగుచ్చుకున్నట్లుంది. వాళ్ళను పంపించివేశాడు.

నాలుగుగంటలైంది. అందరూ వెళ్ళిపోయారు. అంతా నిశ్శబ్దంగా ఉంది. మళ్ళా తన రూము, తానూ ఏకాంతంగా మిగిలారు. కాస్సేపు ఆలోచిస్తూ కూర్చున్నాడు.

ఆయనకు సుభద్ర గుర్తు వచ్చింది. సుభద్రతో గడిపిన కొద్దిక్షణాలు తన జీవితంలో మధురమైనవి. అప్పుడు తానింకా లెక్చరరే. ఆమె తన విద్యార్థిని. మహాలక్ష్మితో సంసారం తనకెప్పుడూ అంత ఉత్సాహంగా లేదు. కాపరానికి వచ్చిన కొద్దిరోజులకే తనకు మహాలక్ష్మి అంటే వ్యామోహం తగ్గిపోయింది. తరువాత జీవితం యాంత్రికంగా ఉంది. తను కాలేజి క్లాసులు వీటితో కాలం నింపుకున్నాడు. సంతానంకోసం వాచిపోతూ మహాలక్ష్మి పూజలూ పునస్కారాలు ఇంటిపనులు వీటితో కాలం నింపుకుంది. ఏమూలా తనలో ఉత్సాహం లేదు. అప్పుడప్పుడూ మనస్సునేదో ఎందుకో తెలియని నీరసం కమ్ముకునేది.

అట్లాంటి క్షణాలలో ఎప్పుడో సుభద్ర తనజీవితంలో ప్రవేశించింది.

కొందరు విద్యార్థులకు కొందరు అధ్యాపకుల మీద ఏదో విపరీతమైన వ్యామోహం ఏర్పడుతుంది. ఒక్కొక్కసారి ఈ వ్యామోహమే వినాశానికి కారణమౌతుంది. సుభద్రకు తనమీద అలాంటి ఆరాధన, వ్యామోహం ఏర్పడ్డాయి. అది ఆమె క్లాసుకు వచ్చిన కొద్దిరోజుల్లోనే తెలిసిపోయింది. ఎప్పుడూ తనకు ఎదురుగానే కూర్చోటము, రెప్పవాల్చకుండా తననే చూస్తూ ఉండడమూ, ఇలా ఏదో మూగభాషలో మొదటినుంచి ఆమె తన వ్యామోహం వ్యక్తం చేస్తోంది. అయినా తను ఆమెనెప్పుడూ పలకరించ లేదు. అలా విద్యార్థులతో చనువు చేసుకోటం తనకు అలవాటు లేదు.

ఒకరోజు ఆమె పలకరించింది. "క్లాసులో జాగ్రత్తగా వింటున్నా మిల్టన్ పద్యాలు, ఇంకా కొన్నిపాఠాలు నాకు బొత్తిగా అర్థం కావడంలేదు. సాయంత్రంవేళ ఇంటికివస్తే ఎప్పుడైనా చెబుతారా?" అని అడిగింది. ఇంటి దగ్గర పిల్లలకు పాఠాలు చెప్పడం తనకు ఇష్టంలేదు. కావలిస్తే క్లాసులోనే మళ్ళా చెబుతాడు. అయినా ఆమె అడిగితే ఆవేళ కాదనలేకపోయాడు. అలాగే చెబుతాను రమ్మన్నాడు.

ఆవేళ సాయంత్రమే ఆమె ఇంటికి వచ్చింది. అప్పుడు మహాలక్ష్మి ఊళ్ళో లేదు. పుట్టింటికి వెళ్ళింది. సుభద్ర రోజూ వచ్చేది. రోజు రోజు దగ్గరగా చూస్తూఉంటే, రోజురోజు తనకూ సుభద్రమీద విపరీతంగా వ్యామోహం పెరిగింది. ఒకరోజు ఆపుకోలేక ఆమెను కౌగిలించుకున్నాడు. ఆమె అభ్యంతరపెట్టలేదు. ఆక్షణం తన జీవితంలో ఎంతో మధురమైంది. ఆతరువాత రోజూ ఆమెకోసం ఆతృతతో ఎదురుచూస్తూ ఉండేవాడు. ఆమె క్రమం తప్పకుండా వచ్చింది కొన్నాళ్ళు. ఆ కొద్దిరోజులు తనకు స్వర్గంలా తోచింది. పాఠాలు మూలపడి మాటలతో మమతలతో కాలం గడిచింది. కాని అతిత్వరలోనే ఈ స్వర్గం మాయమైంది. నరకద్వారం తెరచుకుంది. మహాలక్ష్మి ఊరినుంచి వచ్చింది. సుభద్రకు నెలతప్పింది. ఆమె పాఠాలకు రావడమూ ఆగిపోయింది.

ఎప్పుడో ఒకసారి పార్కుదగ్గర కనపడి సుభద్ర వెక్కివెక్కి ఏడ్చింది. ఆమె బాధచూసి ఏమీ చెప్పలేక తాను ఇంటికి వచ్చాడు. ఏమీ పాలుపోలేదు. బ్రతుకు బజారుపాలవుతుందేమోనని భయం వేసింది. తెలిస్తే మహాలక్ష్మి బాధపడుతుందేమోనని దిగులువేసింది. సుభద్ర బ్రతుకు ఏమవుతుందోనని ఒక్కక్షణం బాధ కలిగింది.

అయినా అప్పుడు భగవంతుడు తనను కాపాడాడు. బ్రతుకు బజారు పాలుకాలేదు. సుభద్రకు ఆనెల్లోనే పెళ్ళి కుదిరింది. ఆమె అత్తవారింటికి వెళ్ళిపోయింది. ఆ దౌర్భాగ్యుడెవరో ఇప్పటికీ ఆ తొలిచూలుబిడ్డ తనబిడ్డే నని మురిసిపోతున్నాడు. ఇది జరిగి ఇప్పటికి పదేళ్ళయింది. ఆ బిడ్డను భర్త లాలిస్తూఉంటే గుండెలమీద కుంపటిలా ఆ మోసాన్ని సుభద్ర ఎలా భరిస్తోందో తనకు తెలియదు. తన బ్రతుకు ప్రశాంతంగా సాగిపోతోంది. శివరావులా తానూ ఆనాడు ధైర్యంగా నిలబడగలిగి ఉంటే? బహుశా ఈనాడు ఈ మనోవ్యథ ఉండేదిగాదేమో; తనను నమ్మిన సుభద్రను వదులుకున్నాడు. తనకు ఏ అపకారము చెయ్యని ఒక అపరిచిత వ్యక్తికి, ఆమె భర్తకు అన్యాయం చేశాడు. ఈబాధ పోదు. ఆలోచనలకు అంతం లేదు. మెదడు బరువుగా ఉంది. తనకు లేని సాహసం ఉన్నందుకు తాను ఈనాడు శివరావుమీద తీర్పు చెపుతున్నాడు. శిక్ష విధిస్తున్నాడు. ఈ లోకంలో మనిషికి కావలసింది నీతిగా బ్రతకటం కాదు, తెరచాటుగా బ్రతకటం? తెర చాటుగా బ్రతకలేకపోతే, బలహీనతలను బయటపడకుండా దాచుకోకపోతే చితికిపోక తప్పదు. బాధతో లేచి ఇంటిముఖం పట్టాడు.

మహాలక్ష్మి వాకిట్లో బంతిమొక్కల దగ్గర కూర్చునిఉంది. ముందర గదిలోకి వెళ్ళాడు. వెనకాలే మహాలక్ష్మి వచ్చింది. కాస్సేపటికి కాఫీ తెచ్చింది. అప్పుడు చెప్పింది. "మీ కాలేజీలో ఎవరో శివరావుట! ఇందాక ఆయన భార్య రేవతి వచ్చింది. తనగోడవంతా చెప్పింది. ఏడ్చింది. ఆయన

సంతోషంగా ఉంటే చాలు. మళ్ళీ పెళ్ళి చేసుకున్నా నాకేమీ అభ్యంతరంలేదు. అలా రాసిస్తాను. దయచేసి ఆయన ఉద్యోగానికేమీ ప్రమాదం రాకుండా చూడండి అని ఎంతో బాధపడింది" అన్నది. "ఊహూ" అన్నాడు తను పరధ్యానంగా! మహాలక్ష్మి మళ్ళా చెప్పింది. "ఆమె వెళ్ళిన రాప్పేపటికి ఆ పిల్ల ఎవరో నందనట కదూ! ఆ అమ్మాయి వచ్చింది. శివరావుగారు సంతోషంగా ఉంటే చాలు. నా వలన ఆయనకు అపకారం జరగకూడదు. కావలిస్తే నేను దూరంగా పోతాను అంటూ బాధపడింది. ఏమిటో వాళ్ళిద్దరినీ చూస్తే జాలివేస్తోంది" అన్నది. తను సమాధానం చెప్ప లేదు. తనకు శివరావంటే అసూయగా ఉంది. ఈ ఆడవాళ్ళ అనురాగాలకూ త్యాగాలకూ హద్దు లేదు. ప్రేమించినవాడి కోసం, కట్టుకున్నవాడి కోసం ఏమైనా చేస్తారు! ఎంతటి హీనస్థితికైనా దిగజారుతారు. నిజంగా ఆ మగవాడు ఏగుణమూలేని ఒట్టి దౌర్భాగ్యుడయినాసరే!

మహాలక్ష్మి మళ్ళా అడిగింది. "ఏం చేస్తారు? అంతా మీచేతిలోనే ఉందిటగా?" అంది. తను విసుగ్గా అన్నాడు "రేపు రిపోర్టురాసి పంపు తాను. అంతకన్నా చెయ్యగలదేమీలేదు." ఒక్క క్షణం మహాలక్ష్మి దిగులుగా చూసింది. మళ్ళా పూజచేసుకోడానికి వెళ్ళింది.

ఆ రాత్రి మహాలక్ష్మి మామూలుగా నిద్రపోయింది. తనకు నిద్రపట్ట లేదు. ఎంత ఆలోచించినా తను చేస్తున్నది మంచిపని అనిపించలేదు ఏమిటో ఈ జీవితాలు! ఒక క్రమము, గమ్యము లేకుండా ప్రవాహంలా దూసుకుపోతున్నాయి! తప్పు చేసింది తనో, శివరావో ఎంత ఆలోచించినా అంతుబట్టటంలేదు. చేసిన తప్పు దాసుకొని తను ప్రిన్సిపాల్‌గా సుఖంగా బ్రతుకుతున్నాడు. తెలివితక్కువగా శివరావు చితికిపోతున్నాడు!

చీకట్లో చేసిన తప్పులకు శిక్ష ఎవరు వేస్తారు!

అంతరాత్మ అనిపిస్తోంది ఏమూలో!